

శివాజీ జయంతి శోభాయాత్రను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శివాజీ జయంతి శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు కిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్ నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమై ప్రధాన వీధుల గుండా దేవునిపల్లి ఆర్యక్షత్రియ సంఘం దగ్గర ముగింపు సమావేశం ఉంటుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొనాలని కోరారు.



ముమ్మరంగా.. ఎమ్మెల్సీ ప్రచారం!

కామారెడ్డి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కామారెడ్డి జిల్లాలో బరిలో ఉన్న అభ్యర్థుల తరపున ప్రధాన పార్టీలు, మద్దతు దారులు ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నారు. కరీంనగర్-నిజామాబాద్ -మెదక్- ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పోరులో పట్టభద్రుల స్థానంలో 56 మంది ఉపాధ్యాయ స్థానంలో 15 మంది బరిలో నిలిచారు. అయితే ఈ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్యే ఎన్నికలు హోరాహోరిగా సాగుతున్నాయి. కేంద్రంలో బీజేపీ,రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఎన్నికలనుప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఆయా పార్టీల నేతలు క్షేత్రస్థాయిలో అభ్యర్థుల తరపున ప్రచారం ఇప్పటికే మొదలుపెట్టారు. సోషల్‌మీడియా ఫోన్‌కాల్స్‌తో ప్రచారం చేపడుతున్నారు.అదేవిధంగా ఆత్మీయ సమ్మేళనాలతో ఓటర్లను కలుస్తు మద్దతు కూడబెట్టుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ ఈనెల 27 న ఉండనున్నందున జిల్లా యంత్రాంగం సైతం ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 54 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటుచేయడంతో పాటు పోలింగ్ విధుల్లో పాల్గొనే అధికారులను,సిబ్బందిని నియమించారు.

గెలుపే లక్ష్యంగా..

కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి ప్రస్తుతం ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూరరఘోత్తమరెడ్డి కొనసాగుతున్నారు. వీరి పదవికాలం మార్చిలో ముగియనుంది. ఆలోపే ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహిస్తుంది. మరోసారి ఈ ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ విజయం సాధించేందుకు వ్యూహాత్మకంగా ముందుకు పోతున్నారు. ఆయా జిల్లాలోని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పట్టభద్రుల ఉపాధ్యాయ ఓటర్లతో సమావేశమవుతూ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్య నేతలైన ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు,లక్ష్మీకాంతారావులు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరపున ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులతో ప్రచారం చేయించడంతో పాటు ఓటర్లతో తరచూ మాట్లాడుతూ గెలిపించాలని కోరుతున్నారు. బుధవారం కామారెడ్డి పట్టణ కేంద్రంలోని సత్యకన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమానికిపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఇంచార్జ్ మంత్రి జూపల్లికృష్ణారావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. అదేవిధంగా బీజేపీ తరపున బరిలో ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యల తరపున జిల్లాలో బీజేపీ నేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో పాటు క్షేత్రస్థాయిలో బీజేపీ శ్రేణులు పర్యటిస్తు ఓటర్ల మద్దతు కూడబెడుతున్నారు. ఇటీవల ప్రచారంలో భాగంగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అభ్యర్థుల తరపున ఓటర్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రధానంగా పట్టణ కేంద్రాలైన కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ బిచ్కుంద లోని ఓటర్లను కలుస్తు మద్దతు కోరుతున్నారు.

- ఓట్ల వేటలో ప్రధాన పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులు
- కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఎమ్మెల్సీ పోరు
- నేడు కామారెడ్డిలో పీసీసీ చీఫ్, ఇన్‌చార్జి మంత్రి ప్రచారం
- ఆత్మీయ సమ్మేళనాలతో ఓటర్లు ముందుకు
- ఓటర్లకు వాయిస్ కాల్స్, మెసేజ్‌లు
- జిల్లాలో పట్టభద్రులవి 16,156.. ఉపాధ్యాయులవి 1,995 ఓట్లు
- జిల్లావ్యాప్తంగా 54 పోలింగ్ కేంద్రాలు

ఓటర్లకు వాయిస్‌కాల్స్, మెసేజ్‌లు

పట్టభద్రులు,ఉపాధ్యాయ ఓటర్లకు అభ్యర్థుల పేర్లతో కూడిన వాయిస్‌కాల్స్ వస్తున్నాయి. అభ్యర్థి పేరు చెబుతూ తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. వీటితో పాటు ఓటర్లకు బల్క్‌మెసేజ్‌లు వాట్సాప్ సందేశాలు షేర్‌చేస్తున్నారు.ఒక్కో ఓటరుకు కనీసం రెండు,మూడు ఫోన్ కాల్స్, మేసేజ్‌లు వస్తున్నాయని ఓటర్లు చెబుతున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి మరింత ఎన్నికల ఖర్చు పెరుగుతున్నట్లుగా సంబంధిత వర్గాలు అంటున్నాయి. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తిగా మారింది. దీనికి తోడు ఓటర్ల సంఖ్య పెరగడంతో అభ్యర్థులకు ఖర్చులు సైతం తడిసిమోపేడు అవుతున్నాయి. అభ్యర్థుల మధ్య పోటి పెరగడంతో విజయంపై అందరిలోను ఉత్కంఠ నెలకొంటుంది.

పట్టభద్రులవి 16,156.. ఉపాధ్యాయులవి 1995 ఓట్లు

జిల్లాలో పట్టభద్రుల ఓట్లు 16,156 ఉండగా ఇందులో కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 9215 ఉండగా పురుషులవి 6180, స్ర్తీలవి 3035 ఓట్లు ఉన్నాయి. ఎల్లారెడ్డిలో మొత్తం ఓట్లు 2617 ఉండగా పురుషులవి 1992, స్ర్తీలవి 625,జుక్కల్‌లో మొత్తం ఓట్లు 4325 ఉండగా పురుషులవి 3,267, స్ర్తీలవి 1,057 ఓట్లు ఉన్నాయి. ఉపాధ్యాయుల ఓట్లు 1995 ఉన్నాయి. ఇందులో కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1327 ఉండగా పురుషులవి 822,స్ర్తీలవి 505, ఎల్లారెడ్డిలో మొత్తం 163 ఓట్లు ఉండగా పురుషులవి 109,స్ర్తీలవి 54,జుక్కల్‌లో మొత్తం ఓట్లు 505 ఉండగా పురుషులవి 371 స్ర్తీలవి 137 ఓట్లు ఉన్నాయి. ఈనెల 27 న ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేసింది. పట్టభద్రులకు 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయగా ఉపాధ్యాయులకు 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. అదేవిధంగా నోడల్ అధికారులను, జోనల్, రూట్ అధికారులను నియమించారు.

నేడు పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్యకన్వెక్షన్‌లో బుధవారం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయసమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల, జిల్లా ఇంచార్జ్‌మంత్రి జూపల్లి కృష్ణారావు,ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ,ఎంపీ సురేష్‌షెట్కార్,జిల్లా ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి పట్టభద్రుడు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు సందీప్, చందు,కిరణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు డ్రైవింగ్‌లో నైపుణ్యత చాలా ముఖ్యం

ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అత్యవసర విభాగంలో పనిచేసే పోలీసులకు డ్రైవింగ్ నైపుణ్యత చాలాముఖ్యమని జిల్లా ఎస్పీ సింధూశర్మ తెలిపారు. మంగళవారం జిల్లాలో కొత్తగా నియామకమైన 189 మంది కానిస్టేబుల్‌కు డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆరువారాల పాటు ఈశిక్షణ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో పోలీసుశాఖలోకి పురుషులతో పాటు మహిళ పోలిసుకానిస్టేబుల్స్ 9 నెలల శిక్షణ ముగించుకుని గత సంవత్సరం నవంబర్‌లో వచ్చారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 75 మందికి డ్రైవింగ్ శిక్షణ ఇప్పించడం జరిగిందని తెలిపారు.అదేవిధంగా జిల్లాలోని మహిళా కానిస్టేబుల్‌లతో ప్రత్యేకంగా క్విక్ రియాక్షన్ టీం జిల్లాలో ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. వీరు ఎక్కడైన శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు వెంటనే అక్కడికి చేరుకుని అక్కడ ఉన్న అధికారులకు మహిళలను అదుపు చేయడంతో సహాయపడతారని తెలిపారు.



మహిళా కానిస్టేబుల్‌కు డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్న దృశ్యం

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- సీఎస్ శాంతికుమారి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళిక బద్దంగా అమలుచేయాలని తెలిపారు. రబీసీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపైసమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయసాగులో రైతులసంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి,తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరాఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.అర్హత గల ప్రతి రైతుకు రైతుభరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు జారీచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 860 హబిటేషన్స్ ఉండగా 17 హబిటేషన్‌లలో త్రాగునీటి సమస్య ఉందని, ఆయా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరాఫరా అయ్యేవిధంగా చూడాలని తెలిపారు. పత్రికలలో వచ్చే వ్యతిరేక వార్తలపై అధికారులు స్పందించి రిజేండర్స్ జారీచేయాలని తెలిపారు. బోర్ వెల్స్‌లకు మరమ్మత్తులు చేయించాలని,రేషన్‌కార్డుల వెరిఫికేషన్‌కు సంబంధించి రోజువారి రిపోర్టులు సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు విక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ కిరణ్మయి,నీటిపారుదలశాఖ సీఈ రవి, మిషన్ భగీరథ ఎస్‌ఈ రాజేంద్రకుమార్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, డీఏఓ తిరుమలప్రసాద్, ఆర్‌డీఓ ప్రభాకర్, డీపీఓ శ్రీనివాస్‌రావు, జిల్లా పౌరసరాఫరాలశాఖాదికారి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు వాటరింగ్ నిర్వహించాలి

వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు వాటరింగ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం గాంధారి మండలం పేట్ సంగెం గ్రామంలో రోడ్డుకిరువైపులా ఉన్న మొక్కలకు కలెక్టర్ నీళ్లుపోశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రత పెరుగుతున్నసందర్భంలో మొక్కలకు ప్రతిరోజు నీళ్లు పోయాలని, మొక్కలను సంరక్షించాలని తెలిపారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలను నాటాలని తెలిపారు. సెగ్రిగేషన్ షేడ్ నిర్వహణ సక్రమంగా లేదని, ఇంటింటి తడిపోడి చెత్తసేకరణ నిర్వహించాలని, వర్మికంపోస్టు తయారుచేయాలని తెలిపారు. వైకుంఠధామంలోమొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం నర్సరీలో మొక్కల పెంపకంను పరిశీలించారు. అనంతరంగా పేట్ సంగెం ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల సన్నద్ధతపై హెడ్‌మాస్టర్,టీచర్లను అడిగి తెలుసుకున్నారు.నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. పాఠశాలకు మిషన్‌భగీరథ పైప్‌లైన్ వేయాలని ఏఈఈని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేశ్వర్,ఎంపీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి

- జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్రగిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవికాలంలో జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్రగిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ అన్నారు. మంగళవారం జిల్లాకు చేరుకున్న ఆయన కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌తో కలిసి పలు అంశాలపై చర్చించారు. వేసవి కాలంలో గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా నీటి ట్యాంకర్ల ద్వారా సరాఫరాచేయాలని, అవసరమైన పక్షంలో అద్దెబోర్ల నుండి నీటిని సరఫరా చేయాలని సూచించారు.



కలెక్టర్‌తో సమావేశమైన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రత్యేకాధికారి శరత్

దారి తప్పుతున్న ఉపాధ్యాయులు

- బాలికలను వేధింపులకు గురి చేస్తున్న కొందరు ఉపాధ్యాయులు
- సంఘటనలు జరిగినప్పుడే అధికారుల హడావిడి
- ఆ తర్వాత పట్టించుకోని విద్యా, పోలీసుశాఖ అధికారులు
- ఇటీవల ప్రతీ పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ల నియామకం
- పాఠశాలల్లో నామ మాత్రంగానే బాలిక క్లబ్‌లు, కమిటీలు
- నిత్యం విద్యార్థినులు, తల్లిదండ్రులకు తప్పని మనోవేదన

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు మంచి నడవడికను నేర్పాల్సిన ఉపాధ్యాయులే దారితప్పి తమ బిడ్డల, మనమరాళ్ల వయస్సున్న పిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ ఉద్యోగానికి కలంకం తెస్తున్నారు. విద్యా సంస్థలకు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ఆకతాయిల వేధింపులతో విద్యార్థినులు మనోవేదనకు గురవుతున్నారు. నిత్యం భయపడుతునే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లివస్తుండగా తల్లిదండ్రులు సైతం వారు ఇంటికి వచ్చేవరకు ఆందోళన చెందుతున్నారు. ఆకతాయిలకు తామేమి తీసిపోమన్నట్లుగా జిల్లాలోని కొందరు ఉపాధ్యాయులు సైతం లైంగిక వేధింపులకు పాల్పడుతుండడంతో విద్యార్థినులు, తల్లిదండ్రుల బాధ వర్ణణాతీతంగా ఉంటుంది. గత ఐదు సంవత్సరాల కాలంలో జిల్లాలో ఇలాంటివే పదులసంఖ్యలో సంఘటనలు వెలుగుచూశాయి. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థిసంఘ నాయకులు పేర్కోంటున్నారు. సంఘటన జరిగినప్పుడే హడావిడిచేస్తు ఈతర్వాత ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న ఒత్తిడితో పటిష్టచర్యలకు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇటివల జిల్లాలో ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌లను నియమించి వారంరోజులు గడవక ముందే జిల్లాలో మరో సంఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

జిల్లాలో ఐదేళ్లలో జరిగిన సంఘటనలు

జిల్లాలో ఐదేండ్ల కాలంలో పదుల సంఖ్యలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. అందులో మచ్చుకకు కొన్ని సదాశివనగర్ మండలంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థినులకు అశ్లీల వీడియోలు చూపడంతో పాటు ల్యాబ్‌కు రావాలంటూ లేకపోతే ప్రాక్టికల్ మార్కులు వేయనంటూ చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో ఉపాధ్యాయుడిని నిలదీయడంతో పాటు విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో సదరు ఉపాధ్యాయుడిని అక్కడి నుంచి మరో పాఠశాలకు బదిలీచేసి విచారణ అనంతరం సస్పెండ్ చేశారు.లింగంపేట మండలంలో, నాగిరెడ్డిపేట మండలంలో విద్యార్థినిలను వేధించడంతో ఫోక్సోకేసు నమోదై వారిని సైతం సస్పెండ్ చేశారు. బిచ్కుంద మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఓ విద్యార్థినితో ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానికులు, విద్యార్థిని తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయునికి దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. గాంధారి మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయునిపై షీటీం సభ్యులు అవర్నేస్ నిర్వహిస్తున్న సమయంలో విద్యార్థినులు వారు ఎదుర్కోంటున్న వేధింపులను షీటిం సభ్యులకు వెల్లబోసుకున్నారు. ప్రస్తుతం అదేమండలంలో మరో సంఘటన జరగడంతో సదరు ఉపాధ్యాయుడిని విద్యాశాఖాధికారులు సస్పెండ్ చేశారు. ఇలా జిల్లాలో బయటకు వచ్చే సంఘటనలు కొన్నే ఉంటున్నాయని చాలా మంది ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న విద్యాశాఖాధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రతీ పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ల నియామకం

తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా ప్రతి పాఠశాల నుండి ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ను నియమిస్తు ఐదురోజుల కిందట జిల్లాలో శిక్షణలు సైతం నిర్వహించారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమించబడిన హెడ్‌మాస్టర్స్, టీచర్‌లకు ఫోక్సో చట్టంపై ఒకరోజు ఒరియన్‌టేషన్ కార్యక్రమాన్ని చేపట్టి అధికారిగా నియమించబడిన వారు పాఠశాలలో పిల్లలు ఎటువంటి లైంగిక దాడులకు గురి కాకుండా వాటిని ప్రారంభదశలోనే అణిచివేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినిలకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి వివరించాలని తెలిపారు.వేధింపుల సంఘటనలు జరిగినప్పుడు ఈ విషయాన్ని రిపోర్టుచేసే విధంగా విద్యార్థినిలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమం చేపట్టిన రోజుల వ్యవధిలోనే గాంధారిలో ఓ ఉపాధ్యాయుడిపై ఫోక్సోకేసు నమోదుకావడంతో మంగళవారం అతనిని సస్పెండ్ సైతం చేశారు. అయితే జిల్లాలోని పలు పాఠశాలలో 2022లోనే బాలికల క్లబ్‌లు, కమిటీలు ఏర్పాటుచేశారు. పాఠశాల హెచ్‌ఎంలు చైర్మన్‌గా, ఒక టీచర్ కన్వీనర్‌గా,హైస్కూల్‌లో ప్రతి తరగతి గది నుంచి ఇద్దరు బాలికలు, స్థానిక మహిళ పోలీసు, షీటీంసభ్యులు ఇలా 10 నుంచి 12 మంది కమిటీలో సభ్యులు ఉన్నారు. కమిటీ సమావేశాలు తరచూ నిర్వహించి, బాలికలు ఎదుర్కోంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కారానికి కృషిచేయాల్సి ఉంటుంది. బాలికలకు అవ గాహనకల్పించేందుకు బాలికల సంరక్షణకు ఏర్పాటుచేసిన 181,100,1098 టోల్‌ఫ్రీ నంబర్లను పాఠశాలల ఆవరణలో ప్రదర్శించాలి.కాని చాలాచోట్ల అంతంతమాత్రంగానే కార్యక్రమాలు చేపడుతూ రావడంతోనే ఈ రకమైన చర్యలకు పలువురు ఉపాధ్యాయులు పాల్పడుతున్నారనే ఆరోపణలు విద్యార్థిసంఘనాయకులు పేర్కోంటున్నారు.కనీసం ఇటివల ఏర్పాటుచేసిన చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌లు అయిన పకడ్బందిగా పనిచేసి విద్యార్థులకు వారితల్లిదండ్రులకు ధైర్యం కలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు చదువు ఒక ఆయుధం

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

రెంజల్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే చదువు ఒక్కటే ఆధారమని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని నీలా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు చదువు ఎంతో ఉపయోగపడుతుందని, ఉన్నతంగా ఎదిగిన విద్యార్థి రేపటి తరానికి బాటలు వేయగలుగుతారని, ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంగా చదివాలన్నారు. కష్టపడి చదివి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా హజరైన ఏసీపీ శ్రీనివాస్, ఎస్ఐ సాయన్న, మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్‌లను ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయ సిబ్బంది శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద్, ప్రవీణ్, మధులత, శ్రీనివాస్, తాహెర్, పీడీ సాయిబాబా పాల్గొన్నారు.

సమాజంలో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..



మాట్లాడుతున్న సాలూర మండల విద్యాశాఖ అధికారి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):సమాజంలో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే సాలూర మండల విద్యాశాఖ అధికారి మంజూష అన్నారు. మంగళవారం బోధన్ మండలం పెంటాకలాన్ జడ్పీ హైస్కూల్‌లో వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో భాగంగా సహకరిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు. దాతల సహకారంతో పాఠశాలలను విద్యార్థుల సౌకర్యార్థం టాయిలెట్లు నిర్మించడం జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాటల శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు బైక్‌ల చోరీ కేసుల్లో ఇద్దరికి ఏడాది జైలు

కమ్మర్‌పల్లి,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బైక్‌ల చోరీ వేర్వేరు కేసుల్లో ప్రమేయమున్న ఇద్దరు వ్యక్తులకు ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయాధికారి నీలి సరళ రాణి మంగళవారం ఇరువురికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. తన బైకు చోరికి గురైందని కమ్మర్‌పల్లికి చెందిన వర్షం గంటి మోహన్ అనేవ్యక్తి ఫిర్యాదు చేయగా కేసునమోదుచేసుకుని బోధన్ పట్టణానికి చెందిన మలావత్ తులసీరామ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కోర్టులో పోలీసుల అభియోగ పత్రం దాఖలు చేశామని కాగా కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన తెడ్డు నరేష్ తన బైక్ పోయిందని ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని బోధన్ పట్టణానికి చెందిన అబ్దుల్ అయాజ్ అనేవ్యక్తిని అరెస్టుచేసి విచారణ అనంతరం కోర్టులో పోలీసుల అభియోగ పత్రం దాఖలు చేశామని ఈ రెండు కేసుల పూర్వపరాలు పరిశీలించిన ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయాధికారి నీలి సరళరాణి ఇద్దరి నిందితులకు ఏడాది చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారని తెలిపారు. కాగా ఈ కేసుల్లో కోర్టులో సాక్షాలనుప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు కానిస్టేబుల్ రాజును ఎస్సై అనిల్ రెడ్డి అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

నవీపేట,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన ముగ్గురికి మంగళవారం న్యాయమూర్తి ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించడం జరిగిందని ఎస్సై వినయ్ తెలిపారు. మూడు రోజుల క్రితం నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన నవీపేటకు చెందిన మహ్మద్ నబీ సాబ్, అబ్బాపూర్(బి)కి చెందిన బాబు, నిర్మల్ జిల్లా కుబీర్‌కు చెందిన రాకేష్‌లు పట్టుబడ్డారని, వీరిని మంగళవారం నిజామాబాద్ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ స్టేట్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం ఎదుట హాజరుపర్చగా ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ తెలిపారు.

ఒంటరి మహిళపై అత్యాచారయత్నం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):బోధన్ మండలంలోని ఓ గ్రామంలో ఒంటరిమహిళపై అత్యాచార యత్నం జరిగిందని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు తెలిపారు.మండలంలోని ఓ గ్రామానికి మహిళ భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో వరుసకు మరిది అయ్యే వ్యక్తి ఆమెపై అత్యాచార యత్నానికి ప్రయత్నించడాన్ని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

మెండోర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్కటూర్ గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ కర్రె బోయిన శ్రీనివాస్(27) మృతి చెందినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు వ్యవసాయ భూమిలో దుక్కి దున్నడానికి వెళ్లి దుక్కి దున్నే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడడంతో డ్రైవర్ అక్కడక్కడే మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్లపై చెత్తను పారవేయరాదు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు మున్సిపల్ వాహనానికి చెత్తను అందజేయాలని, రోడ్లపై పరవేయవద్దని మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ ప్రజలకు తెలిపారు.. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 14వార్డులో ప్రజలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మెప్మా ఆర్‌పీ షబాన, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్‌లో సామాజిక తనిఖీ



ఉపాధి సిబ్బందిని ప్రశ్నిస్తున్న పీడీ సాయాగౌడ్

రెంజల్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతీ ఒక్క కూలీకి ఉపాధిని అందించి సకాలంలో కూలీ డబ్బులను అందించాలనే ఉద్దేశ్యంతో ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఉపాధి హామీలో అవకతవకలను గుర్తించేందుకు సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పీడీ సాయాగౌడ్ అన్నారు. మంగళవారం రెంజల్ మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. రెంజల్ మండలంలోని 17గ్రామాలకు సంబంధించిన ఉపాధి కూలీల ఆడిట్ వివరాలను పరిశీలించారు. గ్రామాలలో మొక్కలను పెంచేందుకు ప్రభుత్వం వన సేవకులను నియమించగా మొక్కల పెంపకంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు నిర్లక్ష్యంగా మొక్కలను పెంచలేదని, నర్సరీలో మొక్కల సంరక్షణ చేపట్టి ప్రతీ మొక్కను కాపాడాలని సూచించారు. అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పనులు చేపట్టి కూలీలకు ఉపాధిని అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కూలీలకు పని కల్పించి సరైనా వేతనం అందించేందుకు ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టిందని కూలీలకు ఉపాధి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ అధికారులు, ఎంపీడీవో వెంకటేష్, ఏపీవో రమణ, ఈసీ శరత్ చంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన



రుద్రూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



బోధన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఏసీపీ

బోధన్‌రూరల్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, పట్టభద్రుల ఓట్లు వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలతో పాటు ఆయా పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పట్టభద్రుల ఎన్నికలలో ఓట్లు వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రైలింగ్ వద్ద సౌకర్యాలు ఉన్నాయా అని ఆరా తీశారు. బోధన్ డివిజన్‌లోని పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలిస్తామని, పట్టభద్రుల ఎన్నికలలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, తదితరులున్నారు.

బోధన్: రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మంగళవారంరుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్ఐ సాయన్న, ఎంపీడీఓ సురేష్‌బాబు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్నీ ఏర్పాట్లు చేయాలన్నారు.

నవీపేట: ఈ నెల 27న జరిగే మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికలలో నవీపేట మండలంలో 810మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 131నెంబర్ గల పోలింగ్ స్టేషన్‌లో పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని ఆయన పేర్కొన్నారు. ఇందులో 492మంది పురుషులు, 318మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 4గంటల వరకు ఈ ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

● 59మంది ఉపాధ్యాయ ఓటర్లు

ఈ నెల 27న జరిగే మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో నవీపేట మండలానికి చెందిన 59మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలోని 80వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఈ ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

మాక్లూర్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ మెనిఫెస్టోలో ప్రకటించి ఆరుగ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ మండల ప్రధానకార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి అన్నారు. సోమవారం మాక్లూర్ మండలంలో ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకం కింద ప్రతీ మహిళలకు రూ.2500, వంట గ్యాస్ సిలిండర్ రూ.500, కౌలు రైతులందరికి ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, అన్ని రకాల వరిధాన్యానికి క్వింటాలుకు రూ.500బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఇచ్చినవాగ్దానాలు అమలు చేయని పక్షంలో ప్రజాపోరాటాలే మార్గమని ఆయన హెచ్చరించారు.ఈకార్యక్రమంలో శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం చలో హైదరాబాద్ గోడప్రతులను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఏడవ హామీ ప్రజాస్వామిక హక్కును పునరుద్దరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్య దర్శి సూర్యశివాజీ, నాయకులు వెంకటేష్, పీడీఎస్‌యు నాయకులు ప్రిన్స్, హుస్సెన్, రాహుల్, లక్ష్మీ, లావణ్య, గంగామణి, పద్మ, జమున, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్)నాయకులు

ప్రధానిని కలిసేందుకు బాలిక స్కేటింగ్ యాత్ర



రుద్రూర్‌లో స్కేటింగ్ యువతి సోని చౌర్సియాను సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):దేశప్రధాని నరేంద్ర మోడీని కలిసేందుకు ఓ బాలిక స్కేటింగ్ యాత్ర చేస్తూ మంగళవారం పోతంగల్ మండలానికి చేరుకొంది. సోనిచౌరసియా అనే బాలిక దేశంలోని వివిధ రాష్ట్రాలో స్కేటింగ్ చేస్తూ దేశ ప్రధాని మోడీని కలువాలని సంకల్పించింది. ఉత్తర్‌ప్రదేశ్ లోని కాశీ నుంచి తన యాత్రను ప్రారంభించి పోతంగల్‌కు చేరుకోగా బీజేపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బీజేపి నాయకులు రాజు, సాయిలు, శ్రీనివాస్, మక్కయ్య, బజరంగ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● మహారాష్ట్ర నుంచి కాశీ వరకు యువతి స్కేటింగ్

బోధన్: మహారాష్ట్ర నుంచి కాశీ వరకు సోని చౌర్సియా అనే యువతి స్కేటింగ్ చేస్తూ ప్రయాణిస్తారని, మహారాష్ట్ర నుంచి బయలుదేరి దెగ్లూర్, పోతంగల్, కోటగిరి మీదుగా రుద్రూర్ గ్రామానికి చేరుకుంది. మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీజేపి పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజు, మండల అధ్యక్షుడు ఆలంపాటి హరికృష్ణ, బీజేపి నాయకులు శాలువాతో సోని చౌర్సియాకు, ఆమె గురువుకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం కాశీ వరకు స్కేటింగ్ చేస్తూ ప్రయాణిస్తానని ఆమె పేర్కొన్నారు. ప్రతిరోజు 130 నుంచి 140 కిలోమీటర్ల వరకు ప్రయాణం కొనసాగిస్తానన్నారు. దేశంలోని 20 రాష్ట్రాలు 10,550 కిలోమీటర్లు స్కేటింగ్ చేస్తూ ప్రయాణిస్తానని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి పలు సమస్యలపై విన్నవిస్తానని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపి పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, బీజేపి నాయకులు కటికె రామ్‌రాజ్, పార్వతి మురళి, గణేష్, అనీల్, వడ్ల సాయినాథ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

ముప్కాల్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనుప్రకారం అందించాలని బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజనం యొక్క వంట పాత్రలు, బియ్యం, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే వండల న్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్ఎం, ఉపాధ్యా యులు, తదితరులు పాల్గొన్నారు.

'తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువుకోవాలి'

కోటగిరి,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీహరి సూచించారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రేరణ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సైకాలజిస్ట్ శ్రీహరి మాట్లాడుతూ.. విద్యారులుచదువుకు తొలిప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జీవితంలో ఎదగడానికి క్రమశిక్షణ, నైతిక విలువలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మోటివేషనల్ వక్తలు నవీన్, నరహరి, అనీల్ రెడ్డి, విఠలేశ్వర్, శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు బర్ల సాయిలు, అర్షద్ హుస్సెన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీపై అంగన్‌వాడీ కేంద్రాల్లో చైతన్య సదస్సు

బోదన్‌రూరల్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీ మహమ్మారిపై అంగన్‌వాడీ కేంద్రాల్లో చైతన్య సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం బోదన్ పట్టణంలోని సరస్వతినగర్‌తోపాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార కల్తీపై చైతన్య సదస్సు నిర్వహించారు. మహిళలు, కాలనీవాసులతో సమావేశం నిర్వహించి ఆహార కల్తీ, అయోడిన్ ఉప్పులో ప్లాస్టిక్ అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు బీఎన్ వర్మ, కార్యదర్శి ప్రవీణ్, బోధన్ అధ్యక్ష, కార్యదర్శులు మారోజి సుధాకర్ చారి, అశోక్ చారి, గైని రత్నాకర్, శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎంపీడీవోకు వినతి

రెంజల్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం నుంచి పంచాయతీలకు ఎటువంటి నిధులు రాక పంచాయతీ వ్యవస్థలో పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం నిధులను మంజూరు చేసి గ్రామ పంచాయతీలను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజేందర్ రావు, రాఘవేంద్ర గౌడ్, మహబూబ్‌అలీ, శ్రీకాంత్,సునీల్,తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం సబ్‌రిజిష్ట్రర్ కార్యాలయంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో కలిసి అదాని, అంబాని కోసం తయారు చేసిన బడ్జెట్ అని, దీంతో ప్రజలకు ఏమి ఒరిగిందిలేదని అన్నారు. మధ్య తరగతి ప్రజలకు, నిరుద్యోగులకు, రైతులకు, కార్మికులకు బడ్జెట్ వల్ల నయాపైసా ప్రయోజనంలేదని, బడ్జెట్‌ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, సీపీఐఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సూర్యశివాజీ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ లెబరేషన్ జిల్లా కార్యదర్శి ఖాజామోయినోద్దిన్, నాయకులు కుతాడి ఎల్లయ్య, బి.రవి, కుల్‌దీప్‌శర్మ, యాటకానకయ్య, నవీన్, సాయిలు, ఖలీల్, సాజిద్‌ఖాన్, ప్రిన్స్, పాషా, మందుల పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఏర్గట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఇబ్రహీంపట్నం ముత్తెమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ మంగళవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం కింద పది వేలు పంపగా స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్,భూమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 18: (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన సదిరం మురళి గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ..ఇటీవలే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిమిత్తం అడ్మిట్ అయ్యాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ శస్త్రచికిత్స నిమిత్తం అవసరమైన రూ.రెండు లక్షల 90వేల ఎల్‌వోసీని సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా మంజూరి చేయించారు. ఈ మంజూరు పత్రాన్ని బాధితుడి సోదరుడు సదిరం రవికి మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు అందజేశారు.కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటి ఛైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చన్న, బుచ్చిమల్లయ్య, నిమ్మ ప్రసాద్, సుంకెట శ్రీనివాస్, పాష, శేఖర్, మారయ్య, గంగాధర్ తదతర నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



ఇస్సాపల్లి పాఠశాలకు మైక్‌సెట్‌ను అందజేస్తున్న వైస్‌ఛైర్మన్ ఇట్టెం జీవన్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.16వేల విలువ చేసే మైక్‌సెట్‌ను ఆర్మూర్ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఇట్టెం జీవన్ వితరణ చేశారు. మంగళవారం మైక్‌సెట్, ఇతర సామగ్రిని ఎంఈవో రాజగంగారాం హెచ్ఎం జగదీష్‌కు అందజేశారు. మైక్‌సెట్ అందజేసిన ఇట్టెం జీవన్‌కు హెచ్ఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణరెడ్డి, అర్పిత, అరుంధతి, రాము, రాజేష్, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి


● డీఎంహెచ్‌వో రాజశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వఆసుపత్రిలోప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. మంగళవారం పట్ట ణం లోని ఏరియా ఆసుపత్రిలో డివిజన్‌స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల తో సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పైలేరియాపై అవగాహన కల్పించారు. వ్యాధికారక క్రిమి ఒకరి నుంచి ఒకరికి ఏ విధంగా వ్యాప్తి చెందుందని వివరించారు.బ్లడ్ సర్వేలో రాత్రి 8గంటల నుంచి 12గంటల వరకు చేయాలని, ప్రజలు స్వచ్చందంగా సహకరించాలని సూచించారు.మార్చి 13వ తేదీన ప్రైవేటు ఆసుపత్రిలో, 18న మ్యాగ్రేటెడ్ సర్వే, 23న మాసర్వే నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ సమావేశం లో డీఎంవో తుక్కారంరాథోడ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి



గగ్గుపల్లిలో రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

ఆర్మూర్‌రూరల్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ జనవాసాల మధ్య ప్రమాదకరంగా ఉందని, సురక్షిత ప్రాంతానికి తరలించాలని గ్రామస్థులు కోరారు.ఈ మేరకు గ్రామసులు ట్రాన్స్‌కో ఏడీఈకి వినతి పత్రం అందజేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణగా కంచె లేకపోవడంతోపశువులు చిన్న పిల్లలకు ప్రమాదకరం గా మారిందనివారన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పం దించి గ్రామ మధ్యలో ఉన్న వి ద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఊరి బయట ఏర్పాటు చేయాలని సాయన్న సురేష్, శ్రీకాంత్, శ్యామ్ అధికారులను కోరారు.

జక్రాన్‌పల్లి వీడీసీపై అట్రాసిటి కేసు నమోదు



ఇంటి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి) జక్రాన్‌పల్లి వీడీసీపై అట్రాసిటి కేసు నమోదు చేసినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. మంగళవారం సీహెచ్. తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన సుంకరి స్రవంతి అనే మహిళ కొత్తగా ఇంటి నిర్మాణం విషయంలో గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకున్న తర్వాత కూడా జక్రాన్‌పల్లి వీడీసీసభ్యులు కమిటీ తీర్మాణానికి వ్యతిరేకంగా నిర్మించి నందుకు బహిష్కరిస్తామని బెదిరిస్తూ ఇంటి స్లాబ్‌ను కూల్చివేసి జరిమానా విధించి కులం పేరుతో దూషించారని సుంకరి స్రవంతి ఫిర్యాదు చేయగా జక్రాన్‌పల్లి వీడీసీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. కొత్త ఇంటి నిర్మాణం స్థలాన్ని నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్ రెడ్డి, సీఐ మల్లేష్, ఎస్సై సీహెచ్.తిరుపతిలు పరిశీలించారు.

మట్కా నిర్వాహకుడికి జైలు

బోదన్‌రూరల్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తికి కోర్టు న్యాయమూర్తి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించారని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆచన్‌పల్లికి చెందిన షేక్.గఫర్ అనే వ్యక్తి మట్కా నిర్వహిస్తున్నాడని పక్క సమాచారంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో మంగళవారం కోర్టులో హాజరుపర్చామన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మట్కా నిర్వాహకుడికి రెండు రోజులు జైలుశిక్ష విధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా మట్కా నిర్వహించిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇటుక బట్టీల యజమానులకు షోకాజు నోటీసు

ముప్కాల్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని ఇత్వార్‌పేట్, జలాల్‌పూర్ గ్రామ సరిహద్దులో గల ఇటుక బట్టి యాజమానులకు షోకాజు నోటీసులు జారీ చేసినట్టు మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడీఈడు పిల్లలను బడిలో చేర్పించకుండా వారితో పనులు చేయించుకుంటున్నారని, బడికి రావడానికి సరైన రవాణా సౌకర్యం, ఆహారం, నీరు సౌకర్యాలు అందించడంలేదని బడికి పంపాల్సిన బాధ్యత ఇటుక బట్టీల యాజమానులదేనని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి, లెబర్ ఆఫీస్ దృష్టికి తీసుకువెళ్ళ నున్నట్టు తెలిపారు. ఇటుక బట్టిల్లో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పిల్లలను పంపం విస్మరించారు. అలాగే విద్యార్థులకు అపర్‌కార్డు జనరేషన్ విషయంలో విద్యార్థులచే చేయించారని ఆయన తెలిపారు. ఆప్రదేశంలో చిన్న పిల్లలను ఉండడం మంచిదికాదని, బడికి పంపక వారికి ఏదైన ప్రమాదం జరిగితే సంబంధిత ఇటుక యాజమాని పూర్తి బాధ్యత ఉంటుందని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మోర్తాడ్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకు న్నామని ఎస్సై విక్రం తెలిపారు. రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వాగులోని ఒర్రె నుంచి ట్రాక్టర్‌లను ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులైన అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. నిజామాబాద్‌లో అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ ఎన్నికలు కీలకం అని నిరుద్యోగులకు న్యాయం బీజేపీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ బీజేపీ ద్వారానే పరిష్కారం అవుతాయని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు ఇచ్చి వేటిని అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. లక్ష ఉద్యోగాలు ఇవ్వకపోగా నిరుద్యోగ భృతిని కూడా ఇవ్వడం లేదన్నారు. యువతకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కూడా చెల్లించడం లేదన్నారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించే బీజేపీ అభ్యర్థులకు పట్టం కట్టాలని ఆయన కోరారు. సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగొళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతుబంధు, రుణమాఫీ వర్తింపజేయాలి



ఆందోళనకు దిగిన రైతులు

ధర్పల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్పబండ తండాకు చెందిన గిరిజనులు మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద ధర్నా చేపట్టారు. అర్హులైన తమకు రైతుబంధు, రుణమాఫీ కాలేదని పట్టాపాసు పుస్తకాలతో నిరసనకు దిదారు. ఒక ఎకరం ఉన్న రైతుబంధు పడలేదని, 50వేల లోపు రుణం ఉన్నా తమకు రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తండాలోగల పంచాయతీ కార్యాలయం వద్ద వారు పాసుపుస్తకాలతో ధర్నా నిర్వహించారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులను ఫోన్‌లో ప్రశ్నించగా తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని, ఆన్‌లైన్‌లోనే రైతుబంధు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారని పేర్కొన్నారు. రైతుబంధు, రుణమాఫీ చేయకుండా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

ఎత్తిపోయని పథకం!

కుకునూర్ ఎత్తిపోతలు

● పని చేయకుండా నిరుపయోగంగా ఉన్న లిఫ్ట్

● పట్టించుకోని పాలకులు, అధికారులు

● లిఫ్ట్‌ను బాగు చేసి సాగునీరు అందించాలని గ్రామ రైతుల వేడుకోలు

ఆంధ్రజ్యోతి ఫోకస్





నీటిని అందించే తుప్పుపట్టిన పైపులు



వృథాగా పెద్దవాగులో ఉన్న లిఫ్ట్‌కు నీరందించే పంప్‌హౌజ్‌లు

వేల్పూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామ సమీపంలో పెద్దవాగు వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం గ్రామప్రజలకు, ఆయకట్టు రైతులకు గుదిబండలా మారింది. కుకునూర్ గ్రామాల చెరువులు నింపి సాగునీరు అందిస్తూ తమను ఆదుకుంటుందనుకున్న ఈ లిఫ్ట్ చెడిపోయి మూలనపడడంతో గ్రామస్థులకు, అన్నదాతలకు అన్నమో రామచంద్ర అనే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ లిఫ్ట్ పథకం ద్వారా గ్రామానికి చెందిన మీది చెరువు, చిన్నచెరువులు నింపి కాలువల ద్వారా 500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2018లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఈ ఎత్తిపోతల పథకంను ప్రారంభించారు. మొదట్లో ఈ లిఫ్ట్ ద్వారా రెండు చెరువులను నింపి సాగునీటిని అందించడం. చెరువుల ఆయకట్టు పరిసరాల్లో భూగర్భ జలాలు పెంపొందించడం వల్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ గత రెండేళ్ల నుంచి లిఫ్ట్ పని చేయకపోవడంతో గ్రామస్థుల ఆనందం ఆవిరైపోయింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఆలసత్వం కారణంగా ఈ లిఫ్ట్ పూర్తిగా నిరుపయోగంగా మారి మూలన పడింది. గ్రామ రైతాంగానికి సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో సాగునీటి అభివృద్ధి శాఖ ద్వారా రూ.5కోట్ల 64లక్షలతో నిర్మించిన ఈ లిఫ్ట్‌కు ఆలనపాలన కరువైంది. ఈ ఎత్తిపోతల పథకంను నమ్ముకున్న గ్రామ రైతుల ఆశలు కొన్నేళ్లకే అడియాశలు కావడంతో గ్రామ రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఈ లిఫ్ట్ భవనంకు భద్రత కోసం ఏర్పాటు చేసిన ఇనుప గేటు విరిగి ఊడిపోయింది. లిఫ్ట్‌కు నీటిని అందించే పైపులు మూలనపడి తుప్పుపట్టాయి. లిఫ్ట్ కోసం ఏర్పాటు చేసిన సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. రెండేళ్ళ కాలం గడిచినా ఇంతవరకు ఎత్తిపోతల పర్యవేక్షణ అధికారులు తమకెమీ పట్టనట్టుగా వ్యవహంచడంతో వాగులో ఏర్పాటుచేసిన రెండు పంప్‌హౌజ్‌లు (నీటి రింగుబావులు) పూర్తిగా ఇసుకతో నిండిపోయాయి. విలువైన విద్యుత్ మోటర్లు మూలనపడి ఇసుకలోనే మునిగి ఉన్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలోని నాయకులు, సంబంధిత అధికారులు స్పందించి లిఫ్ట్‌కు మరమ్మతులు చేపట్టి లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది.

లిఫ్ట్‌ను వినియోగంలోకి తేవాలి

● బోజపల్లి సురేష్, రైతు కుకునూర్



పనిచేయని కుకునూర్ లిఫ్ట్‌ను తిరిగి వినియోగంలోకి తేవాలి. ఈ లిఫ్ట్ ప్రారంభించిన తర్వాత గ్రామానికి చెందిన మీది చెరువు, చిన్నచెరువులు నింపి వాటి కింద ఆయకట్టు పంట భూములకు సాగునీరు అందింది. భూగర్భజలాలు పెరిగి వట్టిపోయిన బోర్ల ద్వారా సమృద్ధిగా నీరు వచ్చింది. గత రెండేళ్ల క్రితం నుంచి లిఫ్ట్ పని చేయకపోవడంతో చెరువులు నిండడంలేదు. వర్షపు నీరు చెరువులకు వచ్చే అవకాశం (అలగం) లేదు. కాబట్టి తామ గ్రామ చెరువులు నింపి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఈ లిఫ్ట్ ఒకటే దిక్కు. తమ గ్రామ రైతుల ఆవేదనన అర్థం చేసుకొని లిఫ్ట్‌కు మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తేవాల్సిర అవసరం ఎంతైనా ఉంది.



మూలనపడ్డ కుకునూర్ ఎత్తిపోతల పథకం భవనం



లిఫ్ట్ ద్వారా నీటిని చెరువుకు అందించే డెలివరీ పాయింట్ హౌజ్



లిఫ్ట్ వద్ద విరిగి ఊడిపోయిన ఇనుప గేటు

రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

● కుల, మతాల పేరిట కొంతమంది రాజకీయం చేస్తున్నారు: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాష్ట్రంలో 55వేల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. కొంతమంది కులాలు, మతాల పేరిట రాజకీయం చేస్తున్నారని, అటువంటి వారికి ఓటు వేయవద్దని కోరారు. మంగళవారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో ప్రైవేటుపాఠశాలల ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరు నరేందర్‌ను బోధన్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేంద్రప్రభుత్వం జీఎస్టీల పేరిట తెలంగాణ ప్రజల డబ్బు దోచుకుంటుందని ఆరోపించారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నా కేంద్రప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి తమ తమ నియోజకవర్గాలను అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. కుల, మతాల పేరిట రాజకీయం చేసే వారికి ఓటు వేయవద్దని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు తెల్లరేషన్ కార్డులు, కార్డులు ఉన్న వారికి ఆరోగ్య భద్రత ప్రభుత్వం నుంచి వచ్చేలా వారికి భరోసా కల్పిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి ఆల్‌ఫోర్స్ నరేందర్‌రెడ్డిని ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తే ఆ ప్రభావం వచ్చే సంస్థాగత ఎన్నికలలో సులువు అవుతుందని వెల్లడించారు. నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రూ.200 కోట్లను సైతం ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించిందన్నారు. ఎన్నికలలో డబ్బులు తీసుకోవద్దని నిజాయితీగా ఓటు వేయాలని పేర్కొన్నారు. వచ్చే సంస్థాగత, మున్సిపల్ ఎన్నికలలో సైతం డబ్బులు తీసుకోకుండా ఓట్లు వేసి అర్హులైన వారిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్‌రావు పట్వారీ, నరాల రత్నాకర్, శరత్‌రెడ్డి, జయప్రకాష్, హరికృష్ణ, విద్యావికాస్ శ్రీనివాస్, వివిధ పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ద్వారా పశువుల పాకల నిర్మాణాలు

● 100 శాతం సబ్సిడీతో నిర్మాణాలు ● మండలానికి 10చొప్పున జిల్లాలో 220 నిర్మాణాలకు శ్రీకారం ● ఆసక్తి చూపుతున్న రైతులు



మాల్తుమ్మెదలో నిర్మాణం పూర్తయిన పశువుల పాక



లింగంపల్లిలో నిర్మాణ దశలో ఉన్న పశువుల పాక

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సన్నకారు, చిన్నకారు రైతులకు చేయూతను అందించేందుకు గాను ప్రభుత్వం ఉపాధిహామీ ద్వారా మహిళా శక్తి ఉపాధి భరోసా పథకం కింద జిల్లాలో పశువుల పాకల నిర్మాణాలను చేపట్టింది. పశు పోషణలో మహిళా రైతులు ఆర్థికంగా ఎదగడానికి వారికి చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం మహిళ రైతుల పేరిట పశువుల పాకలను మంజూరు చేస్తున్నారు. మండలానికి 10 చొప్పున వీటిని మంజూరు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 220 పశువుల పాకలు మంజూరైనట్టు ఉపాధి హామీ అధికారులు తెలిపారు. వంద శాతం సబ్సిడీపై ఈ పశువుల పాకల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉండడంతో జిల్లాలోని మహిళా రైతులు ఈ పశువుల పాకల నిర్మాణాలపై ఎంతో ఆసక్తి చూపుతున్నారు. వీటి నిర్మాణాల కోసం ముందుకొస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఇటీవల ఈ పశువుల పాకలు మంజూరయ్యాయి. ఒక్కో పశువుల పాక నిర్మాణానికి అంచనా వ్యయం సుమారు లక్ష రూపాయలు కాగా, వీటి నిర్మాణానికి గాను 80 వేల రూపాయల నుంచి 90 వేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఈ పశువుల పాకల నిర్మాణాల వల్ల ఎండ, వాన, చలితో పాటు వన్యప్రాణుల నుంచి పశువులను రక్షించుకోవచ్చునని రైతులు చెబుతున్నారు. ఈ పశువుల పాకల నిర్మాణాలు జిల్లాలో వేగవంతంగా సాగుతున్నాయి జిల్లాలో ఇప్పటికే వీటి నిర్మాణాలు కొన్ని పూర్తి కాగా, మిగతావి నిర్మాణ దశలో కొనసాగుతున్నాయి. నాగిరెడ్డిపేట మండలానికి 10 పశువుల పాకలు మంజూరయ్యాయి. మాల్తుమ్మెద గ్రామానికి రెండు, నాగిరెడ్డిపేట, వదల్పర్తి, వాడి, లింగంపల్లి, అక్కంపల్లి, మాటూర్, జప్తి జాన్కంపల్లి, బెజ్జంగం చెరువుతండా గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున మంజూరయ్యాయి. వీటిలో 8 పూర్తైనట్టు మరో రెండు నిర్మాణంలో ఉన్నట్టు స్థానిక ఉపాధిహామీ ఏపీవో తెలిపారు.

నూనె పంటల సాగుపై రైతుల ఆసక్తి



పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ సీజన్‌లో రైతన్నలు వరి, జొన్న, మొక్కజొన్న, శనగ లాంటి పంటలకు సాగు చేసే రైతన్నలు ఈసారి మాత్రం ఆ పద్ధతికి స్వస్తి చెబుతూ నూనె గింజల పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని బాబల్‌గాం శివారుతో పాగు మరి కొన్ని గ్రామాల పరిధిలో రైతన్నలు సాంప్రదాయ పంటలు కాకుండ వేరుశనగ, పొద్దుతిరుగుడు. తెల్ల కుసుమ లాంటి పంటలను సాగు చేస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లో జుక్కల్ నియోజకవర్గంలో అధికంగా నూనె గింజల పంటలకు ప్రాధాన్యత ఉండేది. అయితే రానురాను ఆ పంటలకు సంబంధించి మద్దతు ధర సరియైన విధంగా లభించకపోవడంతో పాటు పంట దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతన్నలు నూనె గింజల పంట సాగువైపు వెళ్లలేదు. ప్రస్తుతం మార్కెట్లో నూనె గింజల పంటలకు మద్దతు ధర బాగుండటంతో తిరిగి రైతన్నలు ఆ పంట సాగు వైపు అడుగులు వేస్తున్నారు. దీంతో మండలంలోని కొన్ని గ్రామాలలో నూనె గింజల పంటలు కళకళలాడుతున్నాయి. ఇక గ్రామాలలో ఉన్న కొంతమంది ఉన్నత కుటుంబాలు మార్కెట్లో విరివిగా లభించే నూనెల కన్నా రైతులు పండించిన నూనె గింజల పంటలను కొనుగోలు చేసి గానుగల ద్వారా నూనెను పట్టించుకుంటున్నారు. దీంతో రైతులు కూడ తాము పండించిన పంటను మార్కెట్ ధర ప్రకారం గ్రామాలలోనే అమ్ముకుంటున్నారు.

విరగబూసిన మామిడి పూత

● వాతావరణ మార్పులతో ఆలస్యంగా పూత

● దిగుబడి తగ్గే అవకాశం

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మామిడి చెట్లు పూత పూశాయి. ప్రస్తుతం మామిడి చెట్లు పూతతో కళకళ లాడుతున్నాయి. వాతావరణంలో మార్పులు అధిక వర్షాలు, చలి తీవ్రత, పొగమంచు లాంటి వివిధ కారణాలు మామిడి పూతపై తీవ్ర ప్రభావం పడింది. ప్రతీ ఏటా సాధారణంగా నవంబరు, డిసెంబరు మాసాల్లో మామిడి చెట్లు పూత పూసి కళకళలాడుతాయి. మామిడి చెట్లకు ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టకుండానే మామిడి పూత సీజన్ వచ్చిందంటే చాలు మామిడి చెట్లని పూతతో విరగబోస్తాయి. నవంబరు, డిసెంబరుమాసంలో మామిడి చెట్లు పూత కొచ్చి జనవరి మాసం చివరివరకు పిందెలుగా మారి ఉగాది నాటికి ఆశించినస్థాయిలో మామిడి పిందెలు పెరిగి మామిడి కాయలుగా మారుతాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా ఈసారి మామిడి చెట్లకు పూత ఆలస్యంగా వచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఫిబ్రవరి మాసం సగం పూర్తవుతుండగా చాలాచోట్ల మామిడి చెట్లు ఇప్పుడిప్పుడే పూత పూస్తు న్నాయి. ఇంకా చాలా చెట్లకు పూత రావాల్సి ఉంది. ఫిబ్రవరి మాసంలో మామిడి చెట్లు పూత పూస్తున్నందున మామిడి కాత కాయడానికి ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మామిడి చెట్లకు ఆలస్యంగా పూత వస్తున్నందున మామిడి పంట దిగుబడి కూడా తగ్గే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఈసారి మార్కెట్లో మామిడి పండ్లకు ధర, డిమాండ్ ఉంటుందని తెలుస్తోంది. అక్కడక్కడ ముందుగా పూత పూసిన మామిడి చెట్లకు చిన్నచిన్న సైజులో మామిడి పిందేలు వచ్చాయి. మామిడిలో బంగినపల్లి, దసేరి, కేసరి, బేనిషాన్, చెరుకు రసం, పెద్దరసాలు, చిన్నరసాలు, మల్గోబా, తోతాపరి లాంటి తదితర మేలు రకమైన మామిడి పండ్లకు భలే డిమాండ్ ఉండటంతో ఈ మేలు రకాలకు చెందిన మామిడి తోటలను ఉమ్మడి జిల్లా రైతులు సాగు చేస్తున్నారు.



నాగిరెడ్డిపేటలో పూత పూసిన మామిడి చెట్టు

నిర్మించారు.. వదిలేశారు!

జర దేఖో!!

● డివైడర్ నిర్మానం చేసిన ఏర్పాటు చేయని సెంట్రల్ లైటింగ్

● డిచ్‌పల్లి-నడిపల్లి మార్గంలో వాహనదారులకు తప్పని తిప్పలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిపల్లి-డిచ్‌పల్లి ప్రధాన రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణం నిర్మాణం పూర్తి అయిన సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంలో అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ శాసన సభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ఈ పనులు ప్రారంభించారు. పనులకు శంకుస్థాపన జరిగి ఏడాదిన్నర గడుస్తున్నా పూర్తిస్థాయిలో పనులు నిర్మాణం చేయకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి ఏడాది గడిచిన, గత ప్రభుత్వం ప్రారంభించిన పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు. అసంతృప్తి నిర్మాణం, లైటింగ్ లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ప్రమాదాలు సంభవిస్తున్నాయని తక్షనమే లైటింగ్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా డివైడర్ మధ్యలో మంచి ఆహ్లాదకరమైన మొక్కలను పెంచాలని డిచ్‌పల్లి, నడిపల్లి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



మొక్కలు నాటకుండా వదిలేసిన డివైడర్‌లో

కేకేవై జాతీయ రహదారిగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలి



మంత్రిని కలిసి కేకేవై రోడ్డు విస్తరణ గురించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

● మంత్రిని కోరిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేకేవై రహదారిని జాతీయ రహదారిగా కేంద్ర అనుమతి ఇప్పించాలని రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హైదరాబాదులో కలిసి విన్నవించినట్లు తెలిపారు. కేకే వై జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా స్థానిక రైతులకు ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కామారెడ్డి నుండి ఎల్లారెడ్డి మీదుగా పిట్లం వరకు రోడ్డు నాలుగు లైన్ల జాతీయ రహదారి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మంత్రికి ఎమ్మెల్యే విన్నవించారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి



గొట్టిముక్కులలో అంగన్‌వాడి సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దోమకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):నర్సరీ, ఆవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం గొట్టిముక్కుల గ్రామంలో నర్సరీ ఆవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ లింగం, ఎఫ్ఏ కే. అంజాగౌడ్, ఆయా హేమలత పాల్గొన్నారు.

ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడు శుభ్రంగా ఉండాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్



భిక్కనూరు పీహెచ్‌సీలో ఫ్మారసీ మెయిన్ స్టోర్‌ని పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పల్లె దవాఖానాల పరిసరాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ అన్నారు. మంగళవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి ఫార్మసీ మెయిన్ స్టోర్‌ని సందర్శించి మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఏమైనా గడువుదాటిన మందులేమైనా ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో నీటి సమస్యపై గ్రామపంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు దివ్య, హెచ్‌ఈవో వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో ఒకరి హత్య

లింగంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాణాపూర్ అటవీ ప్రాంతంలో హత్యచేసి తగుల బెట్టిన సంఘటన మంగళవారం బయటపడింది. వివరాలు ఇలా ఉన్నా యి..పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామానికి చెందిన పోచయ్య(70)ను అతని పరిచయస్తులే హత్య చేసి అటవి ప్రాంతంలో తగులబెట్టినట్లు నిందితులు ఒప్పుకుని సంఘటన స్థలానికి పోలీసులు తీసుకురావడంతో విషయం బయటపడింది. దీంతో అటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పిట్లం పోలీసులు అటవి ప్రాంతంలో వృద్ధుని కాల్చివేసిన చోటుకు వచ్చి అక్కడే పంచనామా నిర్వహించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.

మహాశివరాత్రి ఉత్సవాల కోసం భిక్షాటన

బిచ్కుంద,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మిషన్‌కల్లాలి గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలకోసం సద్గురు బండాయప్ప స్వామి మఠాధిపతి సోమలింగాచార్య మహాస్వామిజీ భిక్షటన చేశారు.ఈ నెల 29 న మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా మహాశివరాత్రి వేడుకలలో భాగంగా శివపార్వతుల కళ్యాణమహోత్సవంలో భక్తులందరూ భాగస్వాములవ్వాలని ఉద్దేశ్యంతో భిక్షటన చేపట్టడం జరుగుతుందని మఠాధిపతి తెలిపారు. శివరాత్రి రోజున లింగోద్భవ పార్వతి పరమేశ్వరుల కళ్యాణమహోత్సవం వీక్షించేందుకు ఇంటింటి నుండి ప్రతి ఒక్కరు పాల్గొని పార్వతి పరమేశ్వరుల ఆశీస్సులు పొందాలని స్వామిజీ తెలిపారు.

ఘనంగా ఖండేరాయమాండలమ్మ ఉత్సవాలు

సదాశివనగర్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తునూర్‌లో శ్రీ ఖండేరాయ మండలామ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మహాదక్షయజ్ఞంను వేదపండితులమంత్రోచ్చరణల మధ్య కొనసాగగా భక్తులు అగ్నిగుండంలో నుంచి జైఖండేరాయ హరహరమహాదేవ అంటూ అగ్నిగుండాన్ని నడుచుకుంటూ దాటారు.రథాన్ని ఏర్పాటుచేసి స్వామివారి విగ్రహాన్ని ర్రతంపై ఉంచి డప్పు వాయిద్యాలతో,డీజే పాటలతో ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటి కార్యవర్గం,ఆలయ ధర్మకర్తలు,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

నిజాంసాగర్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై 26 సంవత్సరాల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని తూర్పాటిమోహన్(28) సంవత్స రాలు మద్యానికి బానిసై మంగళవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ప్రతిరోజు మద్యం సేవించి జులా యిగా తిరుగుతూ ఉండేవాడని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మృతుడికి భార్య కాశవ్వ, ఇద్దరు పిల్లలు కలిగి ఉన్నారు. తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

టెన్త్ విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల వెరిఫికేషన్

మద్నూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలో ఆయా ఉన్నత పాఠశాలలో 2024-25 పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల వెరిఫికేషన్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎక్లార(పెద్ద)లో మంగళవారం వెరిఫయింగ్ టీం సభ్యులు,సునీల్,భీమారావు,శివరామ్, మారుతి సందర్శించి, విద్యార్థుల మార్కులను వెరిఫికేషన్ చేశారు. ఈ ఏడాది జిల్లా విద్యాశాఖ పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు గుర్తు చేశారు.

ఉపాధ్యాయుడి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే కే.రమేష్‌ను సస్పెండ్ చేస్తు డీఈవో రాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సదరు ఉపాధ్యాయుడిపై ఫోక్సోచట్టం కింద కేసు నమోదుకావడంతో అతనిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.ముందస్తు అనుమతి లేకుండా ఉపాధ్యాయుడు రమేష్ జిల్లా హెడ్ క్వార్టర్స్‌ని వదిలివెళ్లవద్దని తెలిపారు.

మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూసే బాధ్యత అధికారులదేనని అధికారులకు ఆదేశించారు. తక్షణమే తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల పరిషత్‌లోని ప్రజా పాలన కేంద్రాన్ని సందర్శించారు. ఎవరైతే సమగ్ర కుటుంబ సర్వేలో నమోదు చేసుకోలేని వారు ఈ నెల 28వ తారీఖు వరకు నమోదు చేసుకో వచ్చు అని అన్నారు. మండలంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సంబధిత అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో వంద శాతం ఇంటి టాక్సు వసులు చేయాలని తెలిపారు. మండల కేంద్రం లోని నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. మండలంలో ఉన్న నర్సరీలో మొక్కలు ఎండుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని ఉండకుండా చూసే బాధ్యత అధికారులదేనని తెలిపారు. ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమములో మండల ప్రత్యేక అధికారి రాజారామ్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీ ఓ సవిత రెడ్డి, పంచాయతీ సెక్రటరీ, గ్రామీణ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఉపాధిహామీ పనులపై సిబ్బందితో రివ్యూ



మద్నూర్ సిబ్బందితో రివ్యూ నిర్వహిస్తున్న అడిషనల్ పీడీ

మద్నూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు ఊతమిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై అడిషనల్ పీడీ వామన్ రావు రివ్యూ సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో మంగళవారం అడిషనల్ పిడి వామన్ రావు ఈజీఎస్ సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవెన్యూ ప్లానిటేషన్ , పనులు పూర్తి చేయాలని కూలీల వివరాలు నమోదు చేసి ప్రతి కూలీకి పని కలి౦చాలని. జాబ్ కార్డు ఉన్న వారందరూ పనిలోకి వచ్చే విధంగా వారికి మోటివేషన్ చేయాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పని కలి౦స్తుందని. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల లను గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు .గ్రామసభలు నిర్వహించి రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా పనులను గుర్తించాలని అన్నారు. ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించాయని .ఇందులో భాగంగా ఇంకుడు గుంతలు, ఫామ్ పాడ్స్ ,కందకాలు తవ్వడం, పొలాలకు వెళ్లేందుకు మట్టి దారులు వేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 2.50.222 లక్షల మంది జాబ్ కార్డులు తీసుకోగా అందులో 1,25,001 మంది మాత్రమే ఉపాధి పథకంలో పాల్గొంటున్నారని. మీ పరిధిలో ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి పనిలోకి రానివారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, ఏపీవో పద్మ, ఈజీఎస్ సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రంతో మహిళలు, బాలికలకు రక్షణ

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): భరోసా కేంద్రంతో మహిళలు, బాలికలకు రక్షణ అని అదనపు ఎస్పీ నరసింహరెడ్డి అన్నారు.మంగళవారం భరోసా కేంద్రం ఏర్పాటై సంవత్సరం కావడంతో సంబంధిత అధికారులతో కలిసి కేక్ కట్‌చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా పోక్సో, మహిళలపై అత్యాచార కేసులను నియంత్రించడానికి స్కూల్లు,కళాశాలలో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫోక్సో కేసు నమోదు అయినప్పటి నుండి చివరి వరకు బాధితులకు అండగా ఉంటూ నేరస్తులకు శిక్షపడేలా చేయడమే భరోసా ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. తమకు జరిగిన అన్యాయం గురించి నిర్భయంగా ముందుకు వచ్చి పీర్యాదుచేయాలని, న్యాయంస్థానం ముందు దోషులకు శిక్ష పడినప్పుడే తిరిగి నేరంగా చేయడానికి వెనుకడుగు వేస్తారని అన్నారు. బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, రాత్రి పగలు అతి తేడా లేకుండా ఎళ్లవేళలా పిల్లల, మహిళల రక్షణకు అందుబాటులో ఉండాలని సూచించారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యం కలగనీయకుండా అన్ని డిపార్ట్‌మెంట్ అధికారులతో సమన్వయంతో విధులు నిర్వహించాలని అన్నారు. నిరాధరణకు గురైన మహిళలు బాలికలకు భరోసా కల్పించేందుకు జిల్లాలో భరోసా కేంద్రం ఏర్పాటుచేశామని తెలిపారు.జిల్లాలో ఇప్పటివరకు 72 కేసులు నమోదుకాగా 49 ఫోక్సో కేసులు ఉన్నాయని అన్నింటికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన 45 మంది బాధిత మహిళలకు 10,12,500లు అందించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ తిరుపయ్య, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ మురళి, ఆర్‌ఐలు సంతోష్‌కుమార్, నవీన్‌కుమార్, కృష్ణ, భరోసా కేంద్రం యస్ఐ జ్యోతి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.



ప్రథమవార్షికోత్సవంలో పాల్గొన్న ఏఎస్పీ నరసింహరెడ్డి

గంజాయి సరఫరాదారుల అరెస్టు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దేవునిపల్లి పీఎస్ పరిధిలోని ఎన్‌హెచ్ 44 రోడ్డుపై గంజాయిసరాఫరా చేస్తున్న వారిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రామన్ తెలిపారు.మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ నుండి కామారెడ్డికి నిషేదిత గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో రామారెడ్డి బ్రిడ్జివద్ద తనిఖీలు చేపట్టగా ఒకకారు, మోటారు సైకిల్‌పై గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులు నిజామాబాద్‌కు చెందిన రాథోడ్‌రవి,సయ్యద్‌సాజిద్ కామారెడ్డికి చెందిన దేవునిపృథ్వి, నిట్టురు సిద్దార్థరావు, పసులోటి భానుచందర్‌లను పట్టుకుని విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుండి 445 గ్రాముల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్‌లు, ఒక స్కూటి,కారు స్వాధీన పరుచుకుని వారిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.ఈ సమావేశంలో దేవునిపల్లి ఎస్ఐ రాజు, క్రైమ్‌టీం సిబ్బంది రవికిరణ్, రామస్వామి, పీసీ బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

భిక్కనూరులో ముగ్గురు బైక్ దొంగల అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని జంగంపల్లిలో బైక్ దొంగతనాలకు మ పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భిక్క నూరు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం భిక్కనూరు పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ వెల్లడించారు. భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న కామారెడ్డి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన అన్నదమ్ములు షేక్ తోఫిక్, షేక్ అఫ్రోజ్‌ను పట్టుకుని విచారించగా భిక్కనూరు మండలం లోని జంగంపల్లి గ్రామంలో తుమ్మల శివకుమార్ తన ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన బైక్‌తో పాటుగా కామారెడ్డి సైలానీబాబా కానీలో స్కూటీని దొంగలించినట్లుగా ఒప్పుకున్నారని, భిక్కనూరులో బండి సిద్దగిరి తన ఇంటిముందు పార్క్ చేసిన బైక్‌ను మండలంలోని మల్లు_పల్లి గ్రామానికి చెందిన వల్లపుగట్టు మల్లేష్ దొంగిలించగా అతడిని పట్టుకోవడం జరిగిందన్నారు. రెండుకేసుల్లో ముగ్గురి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆంజనే యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పగలే వెలుగులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని బాలాజీ నగర్ తండా, లింగారెడ్డిపేట్ రహదారి గేట్ సమీపంలో వీధి దీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. సూర్యుడితో పోటీ పడుతున్నట్లుగా ఉన్న వీధి దీపాలను చూసి పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.తక్షణమేఅధికారు లు స్పందించి వీధిదీపాలను పగటి వేళలో వెలగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ వివరణకోరగా సాంకేతిక కారణాలు, కో తుల బెడద వల్ల కొన్ని చోట్ల వెలుగు తున్నాయని వీధి దీపాలు పగలు వెలగ కుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పగలే వెలుగుతున్న వీధి దీపాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పిట్లం ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):అకోలా-సంగారెడ్డి జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ శకుంతల(35) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం అంతరగామ గ్రామానికి చెందిన బార్యభర్తలు ద్విచక్ర వాహనంపై పిట్లం నుంచి చిన్నకోడప్గల్ గ్రామం వైపు వెళ్తుండగా చిన్నకోడగల్ గ్రామ శివారు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బార్య శకుంతల మృతి చెందగా, భర్తసంగయ్య తీవ్రమైన గాయాలు కావడంతో జాతీయ రహదారి అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని స్థానికులు తెలిపారు.

అంతంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

భిక్కనూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంతంపల్లి గ్రామశివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక యువకుడు మరణించినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం భిక్కనూరు గ్రామానికి చెందిన మంగళి అఖిల్(28) బైక్‌పై కామారెడ్డి నుండి భిక్కనూరుకు వస్తుండగా అంతంపల్లి శివారులో బైక్ చెట్టును ఢీకొనగా తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా అఖిల్ మృతిచెందిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు.

జూపార్క్‌ను సందర్శించిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు

భిక్కనూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పీఎంశ్రీ కార్యక్రమంలో బాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని జూపార్క్, సాలార్‌జంగ్ మ్యూజియం, బిర్లా ప్లాంటోరియంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అనుకూలమైన స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామస్తులందరికీ అనుకూలమైన స్థలంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని వాడి గ్రామానికి చెందిన ఓ వర్గం ప్రజలు మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యానికి తరలివచ్చారు.ఈమేరకు తహసిల్దార్ శ్రీని వాసరావుకు వారు వినతి పత్రాన్ని అందజే శారు. మండలంలోని వాడి గ్రామంలో బి.ఆర్, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు విషయమై ఇరు వర్గాల్లో స్థల వివాదం తలెత్తగా విషయం తెలుసు కున్న ఎలా_రెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహం ఏరా౦టుకు స్థలాన్ని అధికారులు ఎంపిక చేశారు. దీంతో అధికా రులు ఎంపిక చేసిన స్థలంలో స్థానిక తహసిల్దార్ శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై మలా_రెడ్డితో కలిసి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ముగ్గు వేశారు. కాగా ఆర్డీవో, డీఎస్పీ సమక్షంలో ఎంపిక చేసిన స్థలం అనుకూలంగా లేదని అధి కారులు గ్రామస్తులందరితో చర్చించి అందరికీ అను కూలంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేయాలని వారు కోరారు. అంత వరకు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను చేపట్ట వద్దని వారు తహసిల్దార్ శ్రీని వాస్ రావును, ఎస్సైని కోరారు. అనంతరం వారు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి వినతి పత్రాన్ని అంద జేసేందుకు కామారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వాడి గ్రామస్థులు

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు

లింగంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): లింగంపేట బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతికుమార్ మంగళవారంకరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజేయ్‌ను కలిశాడు. కరీంనగర్‌లో జరుగుతున్న పార్టీ అధ్యక్షుల సమావేశానికివిచ్చేసిన కేంద్ర మంత్రిని కలిసి మండలంలో బీజేపీ పని తీరును ఆయనకు తెలియజేసినట్లు క్రాంతికుమార్ తెలిపారు.మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి యువకులు ముందుకు రావాలని ఆయన పిలుపినిచ్చారని ఆయన తెలియజేశారు.



కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు

మాజీ సీఎంను కలిసిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జిల్లా అధ్యక్షుడు

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత,మాజీ సీఎం చంద్రశేఖర్‌రావును ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్,పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను లోపాలను ఎత్తిచూపుతూ చేపడుతున్న నిరసన కార్యక్రమాలను వివరించారు. పార్టీలోని ప్రతి కార్యకర్త అండగా ఉండాలని ఎవరికి ఏ ఇబ్బంది ఉన్న ఇట్టె స్పందించాలని సూచించారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువపై ప్రమాదకరంగా గుంత

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో మురికి కాలు వలపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం నాయకులు డైలీ మార్కెట్ నుంచి సుమార్కెట్ వరకు మురికి కాలువపై స్లాబ్ కుంగిపోయింది. దీంతో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మరో వైపు కొన్ని కాలనీలో వీధి దీపాలు లేక రాత్రి పూట అంధకారం అలుముకుంటోంది. దీనికి తోడు రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు అందులో పడి గాయాటలపాలవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోని గుంతలపై మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేక అభివృద్ధి కుంటుపడుతుంది.గ్రామాలను పర్యవేక్షించే ప్రత్యేక అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు నిర్వహణను సరిగ్గా పట్టించుకోకపోవడంతో గ్రామాలలో అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రత్యేక పాలనలో ఉన్నా తమకు ఎవరూ అడిగేవారు లేరని ఉద్దేశ్యంతోనే లేక అలసత్వమో కాని పంచాయతీ పరిధిలో చిన్న చిన్న పనులను కార్యదర్శులు చేయించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మండలంలోని పోచారం తాండ నుండి పోచారం గ్రామానికి వేల్లే రహదారిపై మురికినీరు పారుతున్న సంబందిత కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రహాదారిపై పారే మురికినీటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నర్సరీలను పరిశీలించిన ప్రత్యేక అధికారి

బీర్కూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలంలోని అన్నారం, చించోల్లి గ్రామాలలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్ నర్సరీలను పరిశీలించారు. రెండు గ్రామాలలో గ్రామ పంచాయితీలను సందర్శించి పంచాయితీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను, కంపోస్టు షెడ్‌లను పరిశీలించారు. వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో భానుప్రకాష్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

బీర్కూర్ పీహెచ్‌సీలో మహిళ ఆరోగ్య శిబిరం

బీర్కూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 30 ఏళ్ళు పై బడిన మహిళలకు వివిధ రకాల క్యాన్సర్, థైరాయిడ్, గర్భకోశ, మూత్ర కోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారిణి శ్రీలేక, సీహెచ్‌వో రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రీతి, సాగర్, సూపర్ వైజర్లు నర్సమ్మ, సుశీల, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల వద్ద చెత్త తొలగింపు

పిట్లం ఫిబ్రవరి 18:చెరువుల చెంతనె చెత్త చెదారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు.సోమవారం చెరువు వద్ద చెత్తను ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో రాము, పరిశీలించి, జేసీబీతో పూర్తిగా తొలగించినారు. చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలించారు.ఇప్పటి నుంచి చెత్తను ప్రతి రోజు డంపింగ్‌యార్డ్‌కు తరలించాలని కార్యదర్శికి బలరాంకు ఆదేశించారు.ఈకార్యక్రుమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బలరాం ఉన్నారు.



చెరువు వద్ద చెత్తను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు